క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

కాకినాడ లీగల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 19 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 15 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఈఎస్ఐ వైద్యుడు ఎం.అన్వేష్ అన్నారు. కార్మిక రాజ్య బీమా సంస్థ కాకినాడ ఈఎస్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో లలిత జ్యూయలరీ షోరూంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఈఎస్ఐ సౌకర్యం కలిగిన ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సంతోష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. మూడు నెలల వ్యవధికి గాను రూ 10.87 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ఎస్.సత్యవాణి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: మీ కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని మీ కోసం సంస్థ సేవలను కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు పిల్లి నాగేశ్వరరావు, సభ్యులు శివ, సందీప్, బాబీ, వెంకీ, అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి భరోసా

సామర్లకోట: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబాన్ని పెద్దాపురం డీఎస్పీ పి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పరామర్శించి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. 1992లో సామర్లకోటకు చెందిన కానిస్టేబుల్ ముసిరి జగదీశ్వరరావు కాకినాడలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక రౌడీ దాడిలో కత్తి పోట్లకు గురై సుమారు 20 రోజులు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మృతి చెందిన పోలీసు కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా ఇస్తున్నారు. ఇందులో భాగంగా కానిస్టేబుల్ భార్య బుచ్చిరాజుకు పండ్లు, స్వీట్లు అందజేశారు. సీఐ ఎ.కృష్ణభగవాన్, ఎస్సై మూర్తి, అడపా గరగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	:	విశ్వం, వేట్టయన్, ఇద్దరు, జనక అయితే గనక
దేవి మల్టీప్లెక్స్	:	ది డెవిల్, విశ్వం, దేవర, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మీ	:	కల్లు కాంపౌండ్
సత్యగారి	:	లవ్ రెడ్డి
తిరుమల	:	ఖడ్గం
సీఅండ్‌సీ	:	జనక అయితే గనక
సీఅండ్‌సీ 2	:	శ్వాగ్
పద్మప్రియ	:	దేవర
శ్రీప్రియ	:	మార్టిన్
సూర్య 1	:	దేవర
సూర్య 2	:	జనక అయితే గనక

నర్సింగ్ విజయం


గెలిచిన ఆనందంలో..


పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

- ముగిసిన గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు
- విజయలక్ష్మి ప్యానల్‌దే విజయం
- ఆరేళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా నిర్వహణ

కాకినాడ క్రైం: ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్ ఎన్నికలు బుధవారంతో ముగిశాయి. ఆరేళ్ల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ఉమ్మడి జిల్లా నర్సెస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లుగా విజయకుమారి ప్యానల్ ఘన విజయం సాధించింది. అక్క, చెల్లి అంటూ ఆప్యాయంగా పిలుచుకుంటూ ఎన్నికలను ఘనంగా ముగించడం ముచ్చటగొల్పింది. ఏకగ్రీవం కాకపోయినా ఆరోగ్యకరమైన పోటీతో ఆదర్శవంతులుగా నిలిచారు. ఈ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగినా తుది ఫలితాలు వెలువడే నాటికి మాత్రం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు సాగింది. 243 ఓటర్లున్న ఈ ఎన్నికల్లో 213 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగింది. రాజమహేంద్రవరం, రంపచోడవరం, అడ్డతీగల సహా ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి నర్సులు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. మొత్తం ఎనిమిది రౌండ్లలో పాతిక ఓట్లు చొప్పున లెక్కించి మరో 13 ఓట్లను విడిగా లెక్కించారు.

ఘన విజయం సాధించి..

బుధవారం కాకినాడ జీజీహెచ్‌లోని రేడియాలజీ సెమినార్ హాల్లో జరిగిన ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్‌తో పూర్తయ్యింది. మూడు ప్యానళ్లు పోటీలో నిలిచిన ఈ ఎన్నికల్లో విజయలక్ష్మి ప్యానల్ ఘన విజయం సాధించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బూరిగ విజయలక్ష్మి (110 ఓట్లు), వైస్ ప్రెసిడెంట్‌గా బొడ్డే రాణి (126 ఓట్లు), సెక్రటరీగా గట్టు ప్రమోద (104 ఓట్లు), ట్రెజరర్‌గా కాకి వెంకట పరమేశ్వరి(137 ఓట్లు), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా విప్పర్తి ఇందిర, కళ్యాణపు దేవి, గండిపడాల వీరలక్ష్మి, బత్తుల అక్కమ్మ, మచ్చ సుజాత ఎన్నికయ్యారు. వీరిలో ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఏకగ్రీవమయ్యారు. పోటీదారులంతా 50 శాతానికి పైగా ఓటు భాగస్వామ్యంతో గెలుపొందారు.

చెల్లని ఓట్లు 29

నర్సింగ్ ఎన్నికల్లో చెల్లని ఓట్లూ ఉన్నాయి. బ్యాలెట్‌లో ఉన్న బాక్స్‌లో పేర్ల ఎదుట టిక్ చేయాల్సి ఉండగా కొందరికి అవగాహన లేక నాలుగు బాక్సుల్లో టిక్ చేయడానికి బదులు ఒకటి రెండు లేదా మూడు బాక్సుల్లో టిక్ చేయడం అలాగే ఒకే బాక్సులో రెండు టిక్‌లు పెట్టడంతో ఆ ఓట్లను చెల్లని కోటాలో పరిగణించారు. అలా ప్రెసిడెంట్ పోస్టుకు 4, వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 10, సెక్రటరీ పోస్టుకు జరిగిన ఓటింగ్‌లో 8, అలాగే ట్రెజరర్ హోదాకు జరిగిన ఓటింగ్‌లో 7 మొత్తం 29 ఇన్‌వాలీడ్ ఓట్లను గుర్తించారు.

వీరే రథసారథులు

రాష్ట్ర ప్రభుత్వ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియను ఎన్నికల అధికారి హోదాలో జిల్లా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.నందన, సహకారిగా మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివ కామేశ్వరరావు నిర్వహించారు. ఎన్నికల రోజు ఎన్నికల నిర్వహణకు అదనపు అధికారుల హోదాలో జగన్నాథగిరి, ఏపిత్రయం, కాండ్రేగులకు చెందిన పీఏసీఎస్ సీఈవోలు కేవీ నరేష్, డీఎంఎస్ శ్రీనివాస్, ఎంకే దుర్గాప్రసాద్, వీకే రాయవరానికి చెందిన పీఏసీఎస్ సీవో ఉమా కొనసాగారు.

ఏపీఎన్జీఓల అభినందనలు

గెలుపొందిన విజయలక్ష్మి ప్యానల్ సభ్యులను ఏపీ ఎన్జీఓ జిల్లా నేతలు కలసి అభినందనలు తెలిపారు. సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ల చంద్రరావు, కాకినాడ యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు నూతనంగా ఎన్నికైన నర్సింగ్ బృందాన్ని అభినందించిన వారిలో ఉన్నారు.

87.6 శాతం ఓటింగ్



ఆరేళ్ల తర్వాత జరిగిన నర్సింగ్ ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం. నర్సుల్లో చైతన్యం వెల్లివిరిసింది. 87.6 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల రోజు మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాం. ఫలితంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యాయి. వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో పోలీస్ బృందం తగిన భద్రతా ఏర్పాట్లు చేసింది.

– టి.నందన, జిల్లా కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, నర్సింగ్ ఎన్నికల అధికారి

సంక్షేమమే ధ్యేయం



నర్సింగ్ ఆఫీసర్ల సంక్షేమమే ధ్యేయంగా శ్రమిస్తాం. ఎన్నికలు సదృద్భావ వాతావరణంలో జరిగాయి. గెలుపోటములకు అతీతంగా నర్సింగ్ వ్యవస్థను గెలిపించుకున్నాం. గెలుపుతో ఉప్పొంగింది లేదు, ఓటమితో డీలా పడిందీ లేదు. అభినందనలు తెలిపి అండగా ఉంటామన్న ఏపీఎన్జీఓ నేతలకు ధన్యవాదాలు.

–విజయలక్ష్మి, రాణి, అధ్యక్ష ఉపాధ్యక్షులు, నర్సింగ్ అసోసియేషన్

అందరినీ అలరించే చిత్రం 'క'


మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

బోట్‌క్లబ్: 'క' సినిమా అన్నివర్గాల వారిని అలరిస్తుందని సినీ నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన కాకినాడ వచ్చారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ 'క' సినిమా వినోద భరితంగా ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆహ్లాదపరుస్తుందన్నారు. ఈ టైటిల్‌కు అర్థం చివరిలో తెలుస్తుందన్నారు. అన్ని భాషల్లో వస్తుందని తెలుగులో మాత్రం తాను డబ్బింగ్ చెప్పానన్నారు. ఈ నెల 31న దీపావళి పండగ సందర్భంగా థియేటర్లలో విడుదల అవుతుందన్నారు. కేఏ ప్రొడక్షన్స్‌లో వచ్చే ఈ సినిమాకు రచయిత, దర్శకుడిగా సుజిత్ సందీప్, నిర్మాతగా చింతా గోపాలకృష్ణ రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు.

ఎస్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ క్రైం: కాకినాడ పోర్టులో ఎస్పీఎఫ్ రైజింగ్ డే పేరుతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావ దినోత్సవం బుధవారం జరిగింది. ఈ వేడుకలను ఎస్పీఎఫ్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విపత్కర వేళలో ఎస్పీఎఫ్ అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. అనంతరం ఎస్పీఎఫ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కొద్ది రోజుల కిందట బడాఖాన పేరుతో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు


ఈఓల సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ డీసీ రమేష్‌బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కార్తికమాసం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. కాకినాడ దేవదాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆలయాల ఈఓలు, అధికారులతో కార్తిక మాస ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబర్ రెండు నుంచి డిసెంబర్ రెండు వరకూ కార్తికమాసం పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓలకు సూచించారు. పంచారామ క్షేత్రాల్లో సోమవారం అభిషేకానికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. ఈ నెల 31 లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. కార్తిక సోమవారాలు, పౌర్ణమి, శుద్ధ బహుళ ఏకాదశి, ప్రభుత్వ సెలవు రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయాల వద్ద మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, స్నానఘట్టాల్లో అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కార్తిక మాసం రద్దీ రోజుల్లో కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని అన్నారు. తెల్లవారుజాము 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి ప్రాతఃకాల పూజల అనంతరం 4.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు, తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్తిక మాసమంతా స్వామివారి గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్తిక దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా మండపాలలో ఉత్సవ విగ్రహాలను పెట్టాలని సూచించారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలను తనిఖీలు చేస్తామని, ఇబ్బందులు ఏమైనా ఉంటే వాటిని సరి చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా దేవదాయశాఖాధికారి గంగాభవానీ, దేవదాయ శాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్, ఆలయాలకు చెందిన ఈఓలు పాల్గొన్నారు.

100 రోజుల పని కల్పించాలి


ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అనుపమ, ఏపీడీ మాధవి

కరప: గ్రామాల్లోని ఉపాధిహామీ పథకం కూలీలందరికీ 100 రోజుల పని దినాలు కల్పించాలని ఆ పథకం కోఆర్డినేటర్, ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఉపాధి పనులపై ఆయన సమీక్షించారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇచ్చి, ఉపాధి కల్పించాలన్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలను కలసి ఆయా గ్రామాల్లో చేస్తున్న పనులు వివరించి, చేయాల్సిన పనుల గురించి చర్చించి, తీర్మానాలు చేయించాలని ఎంపీడీఓ సూచించారు. ఏపీడీ జి.మాధవి మాట్లాడుతూ మండలంలో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేసేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ఇంతవరకు కూలీలకు పని కల్పించడంతో కరప మండలం 83 శాతంలో ఉందని, తక్కువ శాతంలో ఉన్న గ్రామాల్లో లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఏపీఓ జీవీ రమణకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు కె.ప్రకాష్, టి.రాజేంద్ర, పి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రవాణా ఖర్చుల అందజేత


రవాణా ఖర్చుల నిమిత్తం సొమ్ము అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జార్జి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హిందూపూర్‌లో ఈ నెల 25 నుంచి జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్–14 వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలుర, బాలికల జట్లకు రవాణా ఖర్చుల నిమిత్తం రూ.19,600 అందజేసినట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి బుధవారం తెలిపారు. ఈ మొత్తాన్ని కాకినాడలోని ఎస్‌జీఎఫ్ఐ కార్యాలయంలో జట్టు కోచ్ జీజేఆర్ఎస్ కౌర్‌కు అందజేశారు. అదే విధంగా పోటీల్లో పాల్గొంటున్న జట్టుకు స్పోర్ట్స్ కిట్ కూడా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అంతర్ జిల్లాల పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని జట్టు సభ్యులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి సునీల్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి


రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్

బోట్‌క్లబ్: మనకున్న దాంట్లో సేవా కార్యక్రమాలు చేపడితే సంతృప్తి పొందవచ్చని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో బుధవారం లయన్స్ క్లబ్ సంకల్ప్ అధ్యక్షురాలు సామా రాజేశ్వరి భర్త సామా రమేష్ జన్మదినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వర్ కుమార్ ప్రారంభించారు. పుట్టిన రోజు సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వైడీ రామారావు అన్నారు. వివిధ లయన్స్ క్లబ్‌లు సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ముంజులూరి విశ్వేశ్వరరావు, చిట్నీడి శ్రీనివాస్, రమణమూర్తి, మెట్టా రాధ, లక్ష్మీ లావణ్య మాలతి పాల్గొన్నారు.

సభ్యుల సంఖ్య పెంచడం సరికాదు


బోట్‌క్లబ్: దేవాదాయ శాఖకు చెందిన ఆలయాలకు జంబో కార్యవర్గాల రీతిలో ధర్మకర్తల మండలి సభ్యుల సంఖ్యను పెంచడం మంచి పరిణామం కాదని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే టీటీడీ దేవస్థానంలో దశాబ్దంన్నరగా ఇష్టానుసారంగా ధర్మకర్తల మండలి సభ్యుల సంఖ్యను పెంచడం వల్ల అనేక అనర్థాలు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో అధిక ఆదాయం కలిగిన దేవాలయాలకు 12 మందికి మించకుండా స్వల్ప ఆదాయం కలిగిన ఆలయాలకు 8 మందికి మించకుండా ధర్మకర్తలను నియమిస్తే ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుందన్నారు. రాజకీయ వైశిష్ట్యం కోసం కులాల సమీకరణగా ధర్మకర్తల మండలి సంఖ్యను 17కు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే దేవాలయాలకు ధర్మకర్తల మండలి లేకుండా కూటమి శ్రేణులతో ఏర్పడిన ప్రైవేట్ ఉత్సవ కమిటీలు తలకు రోకలి చుట్టిన చందంగా ఉన్నాయన్నారు. వీటిని పెంచి పోషించడంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక వైభవానికి భంగం కలిగి రాజకీయ ఆధిపత్య వర్గ వైషమ్యాలు ఎక్కువవుతాయన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


జి.భావారం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. జి.భావారంలో బుధవారం జరిగిన రీసర్వే- గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు తమ స్వాధీనంలో ఉన్న భూములు, డాక్యుమెంట్ ప్రకారం లేకపోయినా, పక్క భూముల్లో కలిసిపోయినా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తేడాలుంటే రీసర్వేలో సరి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, వీఎస్ వి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి


ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నిబంధనలను వివరిస్తున్న ఎంఏఓ రాజేష్

కరప: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ, రైతులకు మద్దతు ధర లభించేలా సిబ్బంది పని చేయాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం రైతు సేవా కేంద్రాల్లోని డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జులు, కస్టోడియన్ ఆఫీసర్లు, పీఏసీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. రైతు కళ్లాల్లో ధాన్యం నమూనాలు తీసుకోవడం, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి, రైసుమిల్లుకు ధాన్యం తరలించే వరకూ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ సిబ్బంది ధాన్యం నమూనాలు ఎలా తీసుకోవాలి, తేమ శాతం లెక్కకట్టడం, డేటా ఎంట్రీ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సునీతను పరామర్శిస్తున్న ఆయా సంఘాల నాయకులు

కరప: పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ పులపకూర సునీతను లైంగిక వేధింపులకు గురిచేసి, కుల వివక్షతో అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ జిల్లా నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. జనసేన పార్టీ నాయకుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫీల్డు అసిస్టెంట్ సునీతను, ఆమె భర్త వీరబాబును బుధవారం ఆయా సంఘాల నాయకులతో కలసి ఆయన పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటూ, న్యాయం జరిగే పోరాటం చేస్తామన్నారు.

ఘనంగా షిర్డీసాయికి గ్రామోత్సవం


కరపలో షిర్డీసాయి గ్రామోత్సవంలో మహిళల కోలాటం


రమణయ్యపేటలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం

కరప: సాయి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక పల్లపు వీధి గంటాలమ్మ గుడి ఆవరణలోని షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ముత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, లలితా సహస్రనామాలు, సాయి పారాయణ వంటివి నిర్వహించారు. ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని పల్లకీలో ఉంచి సాయి యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా రౌతులపూడి మండలం సాకిరేవులపాలెం మరిడమ్మతల్లి మహిళా కోలాటం అందరినీ అలరించింది. ఆలయ కమిటీ సభ్యులు వుయ్యూరి రామచంద్రరావు, చీకల వెంకటరమణ, శ్రీపాదం సత్యారావు, చిన్నారి వీరభద్రరావు, భాస్కరరావు, పెద్దాడ సత్తిరాజు, చిన్నారి మురళి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం షిరిడీసాయిబాబా గుడి వద్ద మహాన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ నిర్వాహకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.